9 మంది ఉపాధ్యాయులకు మెమోలు జారీ

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

బొల్లారం, జూలై 12 : 'విద్యార్థులతో పనులా' అనే శీర్షికన నమస్తే తెలంగాణ దినపత్రికలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి జిల్లా విద్యాధికారి స్పందించారు. బొల్లారం మున్సిపల్ పరిధిలోని అర్బన్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో గురువారం అక్షయపాత్రకు సంబంధించిన ఆహార పదార్థాల పాత్రలను మోయించడంపై జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులతో పనులు చేయించడాన్ని మందలిస్తూ బాధ్యులపై చర్యలు చేపట్టారు. ఈ మేరకు పాఠశాల ఉపాధ్యాయులు విజయ, జ్యోతి రాణి, ఝాన్సీ రాణి, జయంతి, జీవీవీ మెహరా, లీల, బాల నరసింహారెడ్డి, నాగదేవి, నరేందర్‌లకు మెమోలు జారీ చేశారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని హెచ్చరించారు. కాగా ఉన్నతాధికారుల చర్యలతో విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

కంది ఉపాధ్యాయురాలిపై సస్పెన్షన్ వేటు

సంగారెడ్డి కలెక్టరేట్, జూలై 12 : విద్యార్థులను దండించారనే అభియోగంపై కంది ఎంపీజీపీఎస్ పాఠశాల ఉపాధ్యాయురాలిపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు శుక్రవారం ఎంపీజీపీఎస్ పాఠశాల ఉపాధ్యాయురాలు తన్వీర్ ఫాతిమాను విధుల నుంచి సస్పెండ్ చేసినట్టు డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. తమ పిల్లలను దండించారని విద్యార్థుల తల్లిదండ్రులు చేసిన అభియోగంపై సంబంధిత ఉపాధ్యాయురాలు తన్వీర్ ఫాతిమాను సస్పెండ్ చేస్తున్నట్టు డీఈవో ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

ఈఎస్ఐ దవాఖాన నిర్మించాలని ధర్నా

హైదరాబాద్‌లో ధర్నా నిర్వహిస్తున్న జహీరాబాద్ కార్మికులు

కోహీర్, జూలై 12 : జహీరాబాద్ పట్టణంలో 50పడకల ఈఎస్ఐ దవాఖాన నిర్మించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని ఈఎస్ఐ డైరెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించారు. జహీరాబాద్‌కు చెందిన పలు పరిశ్రమల కార్మికులతో కలిసి డైరెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. దవాఖాన నిర్మించే వరకు ఆందోళన కొనసాగుతుందన్నారు. అనంతరం వేలాది మంది కార్మికుల సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని ఈఎస్ఐ డైరెక్టర్‌కు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్, జహీరాబాద్ క్లస్టర్ కన్వీనర్ మహిపాల్, కార్మికులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

దిగ్వాల్ పిరామల్ కార్మికులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి చంద్రశేఖర్, ఎంజీ రాములు

కోహీర్, జూలై 12 : కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మాజీ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్, ఎక్టీవ్ యూనియన్ అధ్యక్షుడు ఎంజీ రాములు హామీనిచ్చారు. శుక్రవారం మండలంలోని దిగ్వాల్ పిరామల్ ఎంటర్‌ప్రైజెస్ పరిశ్రమ ఆవరణలో కార్మికులతో గేట్ మీటింగ్ నిర్వహించారు. పరిశ్రమలో ఈ నెల 15న నిర్వహించే కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో త్రాసు గుర్తును గెలిపించాలని కోరారు. సమావేశంలో రామలింగారెడ్డి, హనుమంతరావు పాటిల్, కనకయ్య, శంకర్, సంపత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఇండ్లలోకి వర్షం నీరు

వర్షం నీటితో మడుగుగా మారిన ఇంటి ఆవరణ

జిన్నారం, జూలై 12 : ఊట్ల గ్రామంలోని 5వ వార్డులో అధ్వాన పరిస్థితులు నెలకొన్నాయి. చిన్న పాటి వర్షం కురిస్తే వాకిళ్లు, ఇంటి ఆవరణలు మడుగుగా మారుతున్నాయి. నీటిని తొలగించేందుకు బాధితులు నానా అవస్థలు పడుతున్నారు. వర్షం నీరు పారేందుకు మొన్నటి వరకు ఉన్న కాల్వ పూడుకుపోయింది. దీంతో వర్షం వరద కిందికి పారే అవకాశం లేకుండా పోయింది. శుక్రవారం కురిసిన వర్షానికి వరద కిందికి పారకపోవడంతో వాకిళ్లు, ఇంటి ఆవరణలోకి నీళ్లు చేరాయి. సమస్యను బస్తీ వాసులు పంచాయతీ కార్యదర్శికి వివరించారు. కాల్వను పునరుద్దరిస్తేనే నీరు కిందికి పారుతుందని, సమస్య ఉండదన్నారు.

చదువుతోనే భవిష్యత్

- విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి
- పిల్లలకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి
- కలెక్టర్ క్రాంతి వల్లూరు
- ఇస్నాపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల ఆకస్మిక తనిఖీ

రెజ్లర్ల శిక్షణను తిలకిస్తున్న కలెక్టర్ క్రాంతి వల్లూరు

పటాన్ చెరు, జూలై 12: విద్యార్థి దశలో కష్టపడి చదివితేనే భవిష్యత్ బాగుంటుందని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. శుక్రవారం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల్లోని కిచెన్ షెడ్, స్టోర్ రూం, భోజనశాలను ఆమె పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని పాఠశాల సిబ్బందికి సూచించారు. వంట గది స్టోర్ రూమ్ భోజనశాల పాఠశాల ఆవరణలో పరిశుభ్రత పచ్చదనం పెంపొందించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పాఠశాల విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో రెజ్లింగ్ శిక్షణ కార్యక్రమాన్నా ఆమె పరిశీలించారు. పాఠశాల విద్యార్థులు ఇప్పటివరకు 11 సార్లు రెజ్లింగ్ స్టేట్ ఛాంపియన్‌షిప్ రెండుసార్లు నేషనల్ మెడల్స్ పొందినట్లు పాఠశాల రెజ్లింగ్ కోచ్ ప్రియాంక కలెక్టర్‌కు తెలిపారు. చదువుతోపాటు విద్యార్థులు క్రీడల్లో రాణించాలని క్రీడలు విద్యార్థి మానసికోల్లాసానికి దోహదం చేస్తాయని అన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి దేవుజా, తహసీల్దార్ రంగారావు, కళాశాల ఆర్సీవో భీమయ్య, ప్రిన్సిపాల్ యోగేందర్ లక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, ఎంపీడీవో యాదగిరి, ఎంపీఓ హరిశంకర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సింగూరు ఎడమ కాల్వకు నీటిని విడుదల చేయాలి

అందోల్, జూలై 12 : సింగూరు ఎడమ కాల్వకు నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. సింగూరు ఎడమ కాల్వ కింద పుల్కల్, చౌటకూర్, అందోల్ మండలాల రైతులు వరి పండిస్తున్నారన్నారు. ప్రస్తుతం సాగు నీరు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాల్వల ద్వారా వచ్చే నీటి మీద ఆధారపడి పంటలను పండించే రైతులు వరి నాట్లు వేయాలా... వద్దా..? అనే సంశయంలో ఉన్నారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ లేదని వేసవికాలంలోనే క్రమ పద్ధతిలో చెరువులు నింపి రైతులకు ఇబ్బందులు లేకుండా చూశామని గుర్తు చేశారు. కానీ అబద్దాలతో.. మోస పూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి ముందు చూపు లేక రైతులను ఇబ్బందుల పాలు చేస్తున్నదని విమర్శించారు.

కార్మికుల సంక్షేమాన్ని విస్మరించిన కాంగ్రెస్

సమావేశంలో మాట్లాడుతున్న రాంరెడ్డి

సంగారెడ్డి, జూలై 12 : తెలంగాణలో ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నదని, వారి సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని భారతీయ మజ్దూర్ సంఘ్ రాష్ట్ర కార్యదర్శి తూర్పు రాంరెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం పట్టణంలోని బీఎంఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా కార్యవర్గ సమావేశానికి రాంరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాంరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు గడుసున్నా కార్మిక శాఖకు మంత్రి లేరని ఎద్దేవా చేశారు. ఎంఆర్ఎఫ్ అంకెనపల్లి పరిశ్రమలో శ్రమదోపిడీ, పని ఒత్తిడితో పాటు కార్మికులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. యాజమాన్యం ఇష్టారాజ్యంగా కార్మికులను తొలగించడం మానుకోవాలని లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి రామ్మోహన్, జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, కార్యదర్శి మోహన్‌రెడ్డి, నాయకులు ఆదినారాయణ, అంజయ్య, జనార్దన్‌రెడ్డి, ప్రభుతో పాటు పలు పరిశ్రమల కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

నూతన ఎస్సైల బాధ్యతల స్వీకరణ

నాగల్‌గిద్ద, జూలై 12 (నమస్తే తెలంగాణ) : నూతనంగా ఎస్సైగా సాయిలు శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. సంగారెడ్డి ఎస్బీ ఎస్సైగా విధులు నిర్వహించినా ఆయన ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ ఎస్సైగా పని చేసిన సిద్ధిరాములు సంగారెడ్డి వీఆర్‌కు బదిలీ అయ్యారు.

కోహీర్‌లో..

కోహీర్, జూలై 12 : కోహీర్ ఎస్సైగా అరుణ్ కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పోలీస్ స్టేషన్‌కు విచ్చేసిన అరుణ్‌కుమార్‌ను స్థానిక పోలీసులు సాదరంగా ఆహ్వానించారు. అరుణ్‌కుమార్ జోగిపేట నుంచి కోహీర్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఇక్కడ విధులు నిర్వహించిన కృష్ణయ్య రాయికోడ్‌కు బదిలీ అయ్యారు.

సిర్గాపూర్‌లో..

సిర్గాపూర్, జూలై 12 : సిర్గాపూర్ నూతన ఎస్సైగా వెంటక్ రెడ్డి శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. గతంలో పనిచేసిన ఎస్సై మహిపాల్‌రెడ్డి సంగారెడ్డికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఏఎస్సై రవీందర్ గౌడ్, పోలీసు సిబ్బంది నూతన ఎస్సైకి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

మనూరులో..

మనూరు, జూలై 12 : మనూరు నూతన ఎస్సైగా రాజశేఖర్ శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. గతంలో పనిచేసిన ఎస్సై అంబర్య పటాన్‌చెరుకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఎస్సై రాజశేఖర్ మాట్లాడుతూ.. మండలంలో అక్రమ మద్యం, జూదం తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు.

ఝరాసంగంలో..

ఝరాసంగం, జూలై 12 : ఝరాసంగం నూతన ఎస్సైగా నరేశ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో చిరాగ్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఝరాసంగంలో విధులు నిర్వహించిన ఎస్సై రాజేందర్ రెడ్డి బదిలీపై చిరాగ్‌పల్లికి వెళ్లారు.

వనమహోత్సవాన్ని పకడ్బందీగా చేపట్టాలి

చింతకుంటలో పనులను పరిశీలిస్తున్న అధికారులు

అందోల్, జూలై 12 : వన మహోత్సవం కార్యాక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్డీవో జ్యోతి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చింతకుంటలో అడిషనల్ డీఆర్‌డీవో బాలరాజు, డీఎఫ్‌వో శ్రీధర్‌లతో కలిసి వనమహోత్సవం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వన మహోత్సవంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మొక్కల పెంపకంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్, ఎంపీవో అశోక్ కుమార్, ప్లాంటేషన్ మేనేజర్ మణికుమార్, పంచాయతీ కార్యదర్శి శ్రీవిద్య తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం

సికింద్లాపూర్‌లో బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను సన్మానించిన నాయకులు

హత్నూర, జూలై 12 : మండల పరిధిలో పని చేసిన పలువురు ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లడంతో శుక్రవారం స్థానిక నాయకులు, విద్యార్థులు సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. అనంతరం ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. విధుల నిర్వహణలో సహకరించిన విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

గురువుకు ఆత్మీయ వీడ్కోలు

నాగల్‌గిద్ద, జూలై 12 : మండల పరిధిలోని కరస్‌గుత్తి ప్రాథమికోన్నత పాఠశాలలో 9 ఏండ్లుగా ప్రధానోపాధ్యాయుడిగా పని చేసిన బిరాదర్ రవీందర్‌రావు కారాముంగి పాఠశాలకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాల ఆవరణలో ఆయనకు ఆత్మీయ వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు హిరామన్, ఉపాధ్యాయులు ప్రశాంత్, ప్రకాష్, తులసి,జారిన, శ్రీనివాస్, వినయ్, శ్యామల పాల్గొన్నారు.

తాలెల్మ పాఠశాలలో..

అందోల్, జూలై 12 : మండల పరిధిలోని తాలెల్మ పాఠశాలలో పని చేసి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు రాములు, పద్మ, రజినీకాంత్, రవికుమార్, సూర్యారావులను ఎడ్ల బండిపై ఎక్కించి వీడ్కోలు పలికారు. అలాగే కొత్తగా వచ్చిన హెచ్ఎం రమేశ్‌తో పాటు సిబ్బందిని సన్మానించారు. కార్యక్రమం లో మాజీ సర్పంచులు లింగాగౌడ్, అశోక్, మాణిక్యంగౌడ్, మాజీ ఎంపీటీసీ నాగభూషణం, గ్రామ పెద్దలు మల్లేశంగౌడ్, సంగారెడ్డి, రాజాగౌడ్ పాల్గొన్నారు.

సాహితీ దవాఖాన ఆధ్వర్యంలో అన్నదానం

అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

సంగారెడ్డి, జూలై 12 : పట్టణంలోని సాహితీ దవాఖాన ఎండీ రాముమీన ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో అన్నదానం చేశారు. దవాఖానలోని రోగులు, వారి బంధువులు 500 మందికి అన్నదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. అయ్యప్పస్వామి జన్మ నక్షత్రాన్ని పురస్కరించుకొని సాహితీగురుస్వామి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రత్యేక పూజలు

స్వామివారి విగ్రహం

న్యాల్‌కల్, జూలై 12 : లోక కల్యాణం కోసం మండల పరిధిలోని రేజింతల్ సిద్ధివినాయక ఆలయంలో శనివారం నుంచి సతతధార పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ ట్రస్టు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రేజింతల్ ఆశోక్, అల్లాడి నర్సింహులు తెలిపారు. ఇందు కోసం ఆలయంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ఆలయంలో వారం రోజుల పాటు ప్రత్యేక పూజలు చేయనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

న్యాల్‌కల్, జూలై 12 : జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ఫీనిక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జహీరాబాద్ పట్టణంలోని సత్యసాయి మందిర ఆవరణలో ఈ నెల 14న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని సత్యసాయి మందిర సేవా సమితి నిర్వాహకులు తెలిపారు. శంకర కంటి దవాఖాన వైద్యులు పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచిత కంటి అపరేషన్లు చేసి అద్దాలు, మందులు అందజేయనున్నారని పేర్కొన్నారు. ఈ శిబిరం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొనసాగుతుందన్నారు. ఈ అవకాశాన్ని జహీరాబాద్ నియోజకవర్గంలోని అన్ని మండలాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కోహీర్‌లో వ్యక్తి ఆత్మహత్య

కోహీర్, జూలై 12 : పట్టణంలోని ఎక్కల్‌దేవీ కుంటకు చెందిన ఆనంద్(58) ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై అరుణ్‌కుమార్ తెలిపిన వివరాలు.. ఆనంద్ కుటుంబాన్ని పోషించలేక మద్యానికి బానిస అయ్యాడు. గురువారం రాత్రి ఇంట్లో పురుగుల మందు తాగాడు. గ్రహించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం సంగారెడ్డి దవాఖానకు తరలించారు. శుక్రవారం ఉదయం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ప్రమాదవశాత్తు సెక్యూరిటీ గార్డు మృతి

కోహీర్, జూలై 12 : ప్రమాదవశాత్తు సెక్యూరిటీ గార్డు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని వెంకటాపూర్‌లో గురువారం రాత్రి జరిగింది. ఎస్సై అరుణ్‌కుమార్ తెలిపిన వివరాలు.. బీహార్‌లోని రొతాస్ జిల్లా తరోన్ గ్రామానికి చెందిన కుందన్‌కుమార్ (21) వెంకటాపూర్ గ్రామ శివారులోని వెంచర్‌లో సెక్యూరిటీ గార్డుగా రెండు నెలల నుంచి పని చేస్తున్నాడు. గురువారం రాత్రి బీహార్‌కు చెందిన తన స్నేహితులు అప్పు కుమార్, కమేసర్‌తో కలిసి వెంకటాపూర్ గ్రామంలో మద్యం తాగాడు. ముగ్గురు కలిసి తిరిగి వెంచర్‌కు చేరుకున్నారు. మద్యం మత్తులో ఉన్న కుందన్‌కుమార్ ట్రాక్టర్ డ్రైవింగ్ రాకపోయినా నడిపేందుకు యత్నించాడు. ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌పై నుంచి కింద పడ్డాడు. దీంతో వెనుక టైర్లు ఆయనపై వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. శుక్రవారం ఉదయం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, జహీరాబాద్ రూరల్ ఎస్సై ప్రసాదరావు, తదితరులు ఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జహీరాబాద్ దవాఖానకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

1.5 కేజీల గంజాయి స్వాధీనం

రామచంద్రాపురం, జూలై 12 : గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను కొల్లూర్ పోలీసులు అదుపులోకి తీసుకొని శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. ఎస్సై సురేశ్ తెలిపిన వివరాలు.. యూసుఫ్‌గూడకు చెందిన సాయివంశీ విజయవాడకు చెందిన సాత్విక్ దగ్గర 1.5కేజీల గంజాయి తీసుకున్నాడు. విజయవాడ నుంచి గంజాయి తీసుకొని హైదరాబాద్‌కు వచ్చిన సాయివంశీ తన స్నేహితుడైన మోహినుద్దీన్‌కు విషయం చెప్పి అతనితో కలిసి గురువారం రాత్రి గోపన్‌పల్లి వరకు ఆటోలో వచ్చారు. అక్కడి నుంచి తెల్లాపూర్ బీవైజీ వైన్స్ వద్దకు నడుచుకుంటూ వస్తున్న క్రమంలో పోలీసులకు సమాచారం రావడంతో ఆ ఇద్దరిని పట్టుకొని వారి బ్యాగ్‌ను చెక్ చేయడంతో అందులో 1.5కేజీల గంజాయి ఉంది. దీంతో పోలీసులు ఆ ఇద్దరిని అదుపులోకి తీసుకొని గంజాయి స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించారు.

నేడు కొనసాగనున్న డిగ్రీ ప్రవేశాలు

సంగారెడ్డి కలెక్టరేట్, జూలై 12 : తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం ప్రవేశాలు ఈ నెల 13న రెండో శనివారం కొనసాగనున్నాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఫిజికల్ రిపోర్ట్ గడువును ఈ నెల 18వరకు ఉన్నత విద్యాశాఖ పొడిగించిందని పేర్కొన్నారు. దోస్త్ మొదటి, రెండో, మూడో ఫేజ్‌ల్లో తారా కళాశాలలో సీటు వచ్చి, ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ చేసుకున్న విద్యార్థులు సీసీ ఓటీపీ వచ్చిన తర్వాత ఈ నెల 18లోగా కళాశాలలో ఫిజికల్ రిపోర్ట్ చేయాలని తెలిపారు. జిల్లాలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డుతో పాటు రెండు సెట్ల జిరాక్స్ కాపీలను తీసుకొని కళాశాలలో అడ్మిషన్ పొందాలని కోరారు. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా విద్యార్థులు 9989942298, 7989239115 నంబర్లపై సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

సౌర శక్తి యూనిట్ ప్రారంభం

సంగారెడ్డి కలెక్టరేట్, జూలై 12 : అక్షయ పాత్ర ఫౌండేషన్, హెచ్ఎస్‌బీసీ గ్లోబల్ సర్వీస్ సెంటర్స్ ఇండియా భాగస్వామ్యంతో శుక్రవారం కంది అక్షయ పాత్ర ఫౌండేషన్‌లో సౌర శక్తితో నడిచే వంట శాలను ప్రారంభించారు. 165-కేడబ్ల్యూ సోలార్ ప్లాంట్, రెండు వేల కిలోల సామర్థ్యం ఉన్న బయో గ్యాస్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అక్షయ పాత్ర ఫౌండేషన్ హైదరాబాద్ ట్రస్టీ, ప్రాంతీయ అధ్యక్షుడు సత్యగౌరా చంద్ర దాస, చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ ధనుంజయ్ గంజు, హెచ్ఎస్‌బీసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆలయానికి టేకు తలుపులు అందజేత



టేకు తలుపులు అందజేసిన వడ్ల నాగయ్య

రాయికోడ్, జూలై 12 : రాయికోడ్‌లో నూతనంగా నిర్మిస్తున్న హనుమాన్ ఆలయానికి శుక్రవారం మహిబాత్‌పూర్‌కు చెందిన వడ్ల నాగయ్యచారి రూ.20 వేలు విలువ చేసే టేకు తలుపులు నిర్వాహకులకు అందజేశారు. సమావేశంలో గ్రామ పెద్దలు సతీష్‌పంతులు, మణెయ్య, రవి,శ్రీకాంత్ చారి ఉన్నారు.

జాగ్రత్తలతోనే వ్యాధులు దూరం

మహిళలకు మందులు అందజేస్తున్న చైర్‌పర్సన్ రోజా బాల్‌రెడ్డి

బొల్లారం, జూలై 12 : సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా తగు జాగ్రత్తలు పాటించాలని బొల్లారం మున్సిపల్ చైర్‌పర్సన్ కొలన్ రోజా బాల్ రెడ్డి సూచించారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డులో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె పలు సూచనలు చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య బృందం డాక్టర్ రాధిక ఆధ్వర్యంలో మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ప్రభు నాయక్, శైలజ, వైద్య బృందం సభ్యులు, మున్సిపల్ సిబ్బంది, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

తడి, పొడి చెత్త బుట్టలను పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ అపర్ణ శివరాజ్ పాటిల్

సదాశివపేట, జూలై 12 : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్ పర్సన్ అపర్ణ శివరాజ్ పాటిల్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని 26వ వార్డులో డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. వర్షాకాలంలో డెంగీ, మలేరియా వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కాలనీ వాసులకు సూచించారు. అనంతరం కాలనీ వాసులకు తడి, పొడి చెత్త బుట్టలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్, మున్సిపల్ కమిషనర్ ఉమ, ఏఈ రాజేశ్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలి

రాయికోడ్, జూలై 12 : ప్రతి ఒక్కరూ పరిశుభ్రతం పాటించాలని మండల ప్రత్యేక అధికారి జగదీశ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని సంగాపూర్, సింగితం, రాయికోడ్ గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి పరిసరాల శుభ్రతపై అవగహన కల్పించారు. సమావేశంలో ఎంపీడీవో ఎంఎం షరీఫ్, ఎంపీవో అంజలిదేవి, పంచాయతీ కార్యాదర్శి సంగయ్య తదితరులు ఉన్నారు.

దోమల నివారణకు చర్యలు

రామచంద్రాపురం, జూలై 12 : దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకొంటున్నామని ఆర్సీపురం డివిజన్ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పానగేశ్ అన్నారు. శుక్రవారం డివిజన్‌లోని ఓల్డ్ ఆర్సీపురంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు కల్పించారు. కార్యక్రమంలో బల్దియా ఉపకమిషనర్ సురేశ్, ప్రిన్సిపాల్ పీపీరాథోడ్, శానిటేషన్ సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, ఎంటమాలజీ ఏఈ శంకర్, సిబ్బంది మల్లికార్జున్, ఇజాజ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళపై హత్యాయత్నం.. నిందితుడి అరెస్టు

రామచంద్రాపురం, జూలై 12 : మహిళపై హత్యాయత్నం చేసిన ఓ వ్యక్తిని ఆర్సీపురం పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ జగన్నాథ్ తెలిపిన వివరాలు.. ఖైరతాబాద్‌కు చెందిన ప్రియాంకకు సునీల్ అనే వ్యక్తితో వివాహం జరిగింది. వీరికి అబ్బాయి సంతానం ఉన్నాడు. వారిద్దరి మధ్య గొడవల కారణంగా 2019లో పెద్దల సమక్షంలో విడిపోయి వేర్వేరుగా జీవిస్తున్నారు. ఆమె తన కుమారుడితో కలిసి ఆర్సీపురం డివిజన్‌లోని కాకతీయనగర్‌లో నివాసం ఉంటూ ప్రైవేట్ ఉద్యోగం చేస్తు జీవనం సాగిస్తున్నది. ఆమె మేనమామ సంజీవ్‌రావు ఈనెల 5న ప్రియాంక ఇంటికి మద్యం తాగి వచ్చి గొడవ పడ్డాడు. ఆ సమయంలో ఇంట్లోనే ఉన్న ఆమె తండ్రి అతడిని ఇంటికి రావొద్దని చెప్పడంతో అక్కడి నుంచి వెళ్లిపోయాడు. 10న రాత్రి మద్యం తాగి వచ్చి ప్రియాంకతో గొడవకు దిగాడు. ఈ క్రమంలోనే అతను వంటగదిలోకి వెళ్లి కత్తిని తీసుకొని ప్రియాంకపై కుడివైపు మెడపై దాడి చేశాడు. ఇంట్లో గొడవ జరుగుతున్న విషయం గ్రహించిన పైగదిలోని నాగరాజు కిందకు వచ్చి సంజీవ్‌రావు చేతిలో ఉన్న కత్తిని తీసుకొని అక్కడి నుంచి అతను పారిపోయాడు. ప్రియాంక సోదరుడు కార్తీక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు సంజీవ్‌రావుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

కొనసాగుతున్న నవరాత్రి మహోత్సవాలు

న్యాల్‌కల్, జూలై 12 : మండలంలోని ముంగి ఆదిలక్ష్మి ఆశ్రమంలో వారాహిదేవి నవరాత్రి మహోత్సవాలు శుక్రవారానికి ఏడో రోజు కు చేరుకున్నాయి. స్థానిక ఆశ్రమ పీఠాధిపతి దేవగిరి మహారాజ్ ఆధ్వర్యంలో ఆలయంలో ఏర్పాటు చేసి వారాహిదేవికి ప్రత్యేక పూజలతో పాటు చండీహోమాన్ని నిర్వహించారు. జహీరాబాద్ ఎంపీ సురేశ్‌కుమార్ షెట్కార్‌తో పాటు పలు ప్రాంతాలతో పాటు పరిసరా గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆశ్రమ పీఠాధిపతి దేవగిరి మహారాజ్, ఆయా ప్రాంతాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు అధిక సంఖ్యలో పాని ప్రత్యేక పూజలు చేశారు.

వీరభద్రస్వామి హుండీ ఆదాయం రూ.16.74 లక్షలు

గుమ్మడిదల, జూలై 12 : మండల పరిధిలోని బొంతపల్లి వీరభద్ర స్వామి ఆలయంలో హుండీ లెక్కించారు. శుక్రవారం స్వామివారికి అమ్మవారికి భక్తులు సమర్పించిన కానుకలను, నగదును రాజరాజేశ్వరి సేవా సంస్థ భక్తులు లెక్కించగా రూ.16లక్షల, 74వేల, 872నగదు, అన్నదానం హుండీ ఆదాయం రూ.75వేల 38నగదు వచ్చినట్లు అసిస్టెంట్ కమిషనర్ శివరాజ్, కార్యనిర్వహణ అధికారి శశిధర్ గుప్తా తెలిపారు. హుండీ లెక్కింపులో మాజీ ఎంపీటీసీ నాగేందర్ గౌడ్, మాజీ ధర్మకర్త లక్ష్మీనారాయణ, దేవస్థాన సిబ్బంది రవీంద్ర మూర్తి, జూనియర్ అసిస్టెంట్ సోమయ్య, భక్తులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

అందోల్, జూలై 12 : మండలంలోని 223 మంది లబ్ధిదారులకు శుక్రవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేసినట్లు తహసీల్దార్ భాస్కర్ తెలిపారు. శుక్రవారం తహసిల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన లబ్ధిదారులకు చెక్కులు అందజేశామని తెలిపారు.

యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్

వేలం కోసం బహిరంగ ప్రకటన

తాకట్టు బంగారు ఆభరణాల ఆస్తుల ఇ-వేలం కోసం బహిరంగ ప్రకటన

దిగువ ఖాతాలలో తాకట్టుపెట్టిన బంగారు ఆభరణాల బహిరంగ వేలాన్ని దిగువ తెలిపిన బ్రాంచ్ వద్ద యాక్సిస్ బ్యాంక్ నిర్వహించుటకు ప్రతిపాదించిందని నిర్దేశిత రుణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయడమైనది. దిగువ తెలిపిన రుణగ్రహీతలు సెక్యూరిటీ నిమిత్తం బ్యాంక్ పేరున బంగారు ఆభరణాలు (బంగారు రుణ సౌకర్యం) తాకట్టుపై యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్ నుండి రుణ సదుపాయాలను వినియోగించుకున్నారు. వినియోగించుకున్న బంగారు రుణ సౌకర్యం నిమిత్తం తమ బకాయి మొత్తాలను చెల్లించాల్సిందిగా రుణగ్రహీతలు/హామీదార్లను కోరుతూ రుణగ్రహీతలకు/హామీదార్లకు డిమాండ్ నోటీస్‌లు జారీ చేశారు. అయితే రుణగ్రహీతలు/హామీదార్లు బకాయి రుణ మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలమైనందున తాకట్టు ఇన్‌వోక్ చేయుట బ్యాంక్‌కు తప్పనిసరి అయింది. మరియు ఆస్తి షెడ్యూల్‌లో మరింతగా వివరించిన తాకట్టు బంగారు ఆభరణాలను ''ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలాగే మరియు అక్కడ ఏమున్నదో అదే మరియు రికోర్స్ పద్ధతి లేని విధంగా'' తేది: **23 జూలై, 2024న మ॥ 12.30 గం. నుండి మ॥ 3.30 గం. మధ్య** (ఇ-వేలం సమయం) ఇ-వేలం అమ్మకం నిర్వహించుటకు ప్రతిపాదించబడినది. **రుణగ్రహీతలు మరియు బకాయి మొత్తం వివరాలు:**

క్ర.సం.	బ్రాంచ్ పేరు	రుణ A/c నెం.	వినియోగదారు పేరు	బకాయి మొత్తం	డిమాండ్ నోటీస్ తేది	స్థూల బరువు	నికర బరువు
1	జహీరాబాద్	XXXXXXXXXX0099	కొలన్ నారాయణరెడ్డి	157300	15-మార్చి-24	39.9	38.9
2	సిద్దిపేట	XXXXXXXXXX0588	సమగళ్ల జీవన్	113960	07-జూన్-24	24.7	24.4
3	సంగారెడ్డి	XXXXXXXXXX8453	నీరుడి జైభవాని శంకర్	148222	07-జూన్-24	36.5	33.9

ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా ఖాతాను తొలగించుటకు/ వేలం తేదీని మార్చుటకు యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్‌కు అథారిటీ కలదు. వేలం ఆన్‌లైన్‌లో **https://gold.samil.in** (ఆన్‌లైన్ వెండార్ యొక్క వెబ్‌సైట్)లో **మ॥ 12.30 గం. నుండి మ॥ 3.30 గం.** మధ్య నిర్వహించబడును. సవివరమైన నియమనిబంధనల కొరకు వెబ్‌సైట్ **https://gold.samil.in** (ఆన్‌లైన్ వెండార్ యొక్క వెబ్‌సైట్)కు లాగిన్ కావలెను.

అధీకృత అధికారి, యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్.